మసీదులో కలెక్టర్ ప్రార్థనలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ బాషలతో కలసి మంగళవారం రాయచోటి ఠాణా సర్కిల్‌లో ఉన్న జామియా మసీదును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మసీదు మత పెద్దలు కలెక్టర్, జెసికి ఘనంగా స్వాగతం పలికారు. జామియా మసీదు విశేషాలను వివరించారు. అనంతరం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మైనార్టీ నాయకులు బేపారీ మహమ్మద్ ఖాన్, వివిధ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

మసీదులో ప్రార్థనలు చేస్తున్న కలెక్టర్, జెసి

'బుగ్గన'పైనే భరోసా

- కదలని జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2
- ఉక్కు పరిశ్రమ పనుల్లో కదలికేదీ?
- ఎత్తిపోతలకు మోక్షమెప్పుడో?!
- నేడే ఆశల బడ్జెట్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్ 2024-25 సమర్పణకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, పారిశ్రామికం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్న నేపథ్యంలో బడ్జెట్‌పై ఆశలపై అందరి దృష్టి నిలిచింది. ఏడాదిన్నరగా పారిశ్రామికానికి మౌలిక వసతుల కల్పనలో కదలిక వచ్చినప్పటికీ పరిశ్రమల ఏర్పాటు నానాటికీ ఆలస్యమవుతోంది. ఈ ఏడాదిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అవుతుందని చెప్పవచ్చు. జిల్లా ఇరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు గతేడాది తరహాలోనే సుమారు రూ.2,700 కోట్ల కేటాయించాలని కోరుతూ ప్రతిపాదనలు అందజేసింది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 ప్యాకేజీ పనులు, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతలు, రాజోలు, జొలదరాశి, యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి సరఫరా ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో కేటాయింపులు చేయాల్సి ఉంది. పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ ప్రకారం మూడేళ్లలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ప్రారంభిస్తామనే గడువు ముగిసినప్పటికీ శంకుస్థాపనల దశలోనే కొట్టు మిట్టాడుతోంది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 కాంట్రాక్టుల రివర్స్ టెండరింగ్ పేరుతో ఎటువంటి పురోగతీ లేకుండా పోయింది. ఇటీవల జిఎన్‌ఎస్‌ఎస్ ప్యాకేజీ-1, ప్యాకేజీ-2 ప్యాకేజీ-3 పనులకు టెండర్లు నిర్వహించడం మినహా మిగిలిన ప్యాకేజీ-4, ప్యాకేజీ-5, ప్యాకేజీ-6, ప్యాకేజీ-7 పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయింది. రూ.1357 కోట్లతో రాజోలి, రూ.1312 కోట్లతో జొలదరాశి, రూ. 564 కోట్లతో కుందూ-పెన్నా ఎత్తిపోతల, రూ.5 వేల కోట్లతో కాలేటివాగు ఎత్తిపోతల పథకం పనులకు భూసేకరణ, అడ్డంకుల కారణంగా ముందుకు సాగడం లేదు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్ పనులు సాకారానికి నోచుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనల సందర్భంగా ఆయా పనుల పురోగతిని ఏకరువు పెట్టడానికి ప్రాధాన్యత ఇవ్వడం తెలిసిందే. అయినప్పటికీ ఆశించిన పురోగతి కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వాసితుల సంగతిని పట్టించుకోవడం లేదు. గండికోట నిర్వాసితులకు పెంచిన పరిహారం ఎప్పటికి అందుతుందో తెలియడం లేదు. తెలుగుగంగ, చిత్రావతి, సర్వారాయసాగర్ రిజర్వాయర్ల లీకేజీ పనులు దశాబ్దాల తరబడి నిరీక్షిస్తుండడం తెలిసిందే. తెలుగుగంగ ఇంజనీరింగ్ యంత్రాంగం తాజాగా రూ.125 కోట్ల మేరకు ప్రతిపాదనలు పంపించింది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2, టిజిపి ప్రతిపాదనల్లో ఏమేరకు కేటాయింపులు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

జిబిలు విడుదల చేయకపోతే మరో సమ్మెకు సిద్ధం

- నిరసనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

రాయచోటి : మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గత ఏడాది డిశంబర్ 26 నుంచి జనవరి 10 వరకు నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమ్మె కాలంలో ప్రభుత్వం ఒప్పుకున్న డిమాండ్లకు సంబంధించిన జిఒలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల 16 రోజులు సమ్మెలో భాగంగా చర్చల్లో ప్రభుత్వ పెద్దలు మంత్రులు ముఖ్య అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించినందుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షులు ఎం.చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే జిఒల రూపాన విడుదల చేయాలని డ్రైవర్లకు రూ.24,500, పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500, కోవిడ్-19 కార్మికులను ఆప్కోస్‌లో చేర్చడం ఇంజినీరింగ్ సెక్షన్‌లో వారికి జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడం వంటి హామీలు ఇచ్చి సమ్మెను విరమింప చేశారని, కానీ సమ్మె విరమించి దాదాపుగా నెల కావస్తున్నా ప్రభుత్వ వైపు నుంచి ఎలాంటి జీవోలు విడుదల కాలేదని పేర్కొన్నారు. జిఒలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేసేందుకు సిద్ధమని వచ్చే సోమవారంలోగా జిఒలు విడుదల చేయకపోతే ఏ రోజైనా సమ్మెలోకి వెళ్తామని అందుకు కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అగ్గిరామయ్య, వై వెంకట్రామయ్య, తిరుపతమ్మ, కేశమ్మ, సుహాషిణి, రమణమ్మ, సిఐటియు నాయకులు మధవ్, శిద్ధముల్లు, సిద్ధయ్య, హర్ష నాగరాజ, సి.ఎం.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు గత నెలలో మొత్తంగా చేపట్టిన సమ్మెకు సంబంధించిన 16 రోజుల వేతనం వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె కాలపు వేతనం విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ సమ్మె వేతనం చెల్లిస్తామని మాట చెప్పి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ ఓబయ్య, కార్మికులు లక్ష్మీదేవి, ప్రసాద్, బాలాజీ, రమణ, మధు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఎర్రచందనం స్మగ్లర్ల ఘాతుకం

- వాహనంతో ఢీకొట్టడంతో కానిస్టేబుల్ మృతి
- స్మగ్లింగ్ సమాచారంతో అడ్డుకునేందుకు వెళ్లిన సిబ్బంది
- మృతుడి కుటుంబానికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ డిఐజి, ఎస్‌పి, అటవీ అధికారులు

అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు ఘాతుకానికి పాల్పడ్డారు. విధినిర్వహణలో ఉన్న పోలీసులకు తెలియదు కాబోలు, తాము ఎదుర్కోబోతోంది మానవత్వంలేని కరడు కట్టిన మానవ మృగాలను అని. ఎర్రచందనం స్మగ్లర్లు పోలీసులకు పట్టుబడకుండా తమను తాము కాపాడుకుంటూ, తమ వెంట ఉన్న ఎర్రచందనం దుంగలు వారికి అందకుండా ఉండేందుకు ఎంతటికైనా తెగిస్తారని ఊహించలేదు పాపం. ఏమైతేనే ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న స్మగ్లర్లు విధి నిర్వహణలోని ఓ కానిస్టేబుల్‌ను బలిగొన్నారు. ఫలితంగా మృతుడి భార్య, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. మార్చురీలోని కానిస్టేబుల్ మృతదేహాన్ని చూడ వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం విషాదంతో నిండుకుంది.

పోలీసుల అదుపులో ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లు

దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ బి.గణేష్

బి.గణేష్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పీలేరు

విధి నిర్వహణలో ఉన్న ఎపిఎస్‌పి 14వ బెటాలియన్ కానిస్టేబుల్ బి.గణేష్ (40)పై ఎర్రచందనం స్మగ్లర్ల వాహనం దూసుకు పోయిన ఘటనలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లె మండలంలో చోటు చేసుకుంది. అన్నమయ్య జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా ధర్మవరం గుట్టకిందపల్లికి చెందిన గణేష్ (40) ఎపిఎస్‌పి 14వ బెటాలియన్ 2013వ బ్యాచ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్‌కు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై మంగళవారం తెల్లవారుజాము మూడు గంటల ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్‌కు అందిన రహస్య సమాచార మేరకు తిరుపతి నుంచి కంభంవారిపల్లె మండలంలోని గుండ్రేవారిపల్లి క్రాస్‌కు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేరుకుని, వాహనాల తనిఖీ చేపట్టింది. పోలీసులను పసిగట్టిన స్మగ్లర్లు తమ వాహనం దారి మళ్లించే ప్రయత్నంలో విధుల్లో ఉన్న గణేష్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌ను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు చెప్పారు. ఈ ఘటనలో ఏడు ఎర్రచందనం దుంగలతో సహా ఇద్దరు నిందితులు పట్టుబడ్డారని, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య అనూష, దేహాన్ష్, రాజ్ కిషోర్ అనే ఇద్దరు కుమారులున్నారు.

మృతుడు కానిస్టేబుల్ బి.గణేష్ భౌతిక కాయాన్ని ఎస్‌పి కృష్ణా రావు సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను కలిసిన తాము అండగా ఉంటామంటూ ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మృతుని కుటుంబానికి రూ.30 లక్షలు ఆర్థిక సాయం అందజేసినట్లు ప్రకటించారు. ముద్దాయిలను అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అన్నమయ్య జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, పీలేరు ఫ్లైయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఒ జె.వి.సుబ్బారెడ్డి, తిరుపతి అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ డిఎఫ్ఒ శ్రీనివాసులు, మదనపల్లి అటవీశాఖ సబ్ డిఎఫ్ఒ శ్రీని వా సులు, పీలేరు అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ రామ్లానాయక్, ఇతర అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఎపిఎస్‌పి కానిస్టేబుల్ బి.గణేష్ భౌతిక కాయాన్ని సందర్శించి విచారం వ్యక్తం చేశారు. ముద్దాయిలు ఎంతటివారైనా పట్టుకుని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీడియాకు తెలిపారు. మృతుని భార్య, కుటుంబ సభ్యులను ఓదార్చి మనో నిబ్బరంతో ఉండాలని, ప్రభుత్వ పరమైన సహాయ సహకారాలు అందించడానికి వీలైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం : డిఐజి

కానిస్టేబుల్ బి.గణేష్ కుటుంబాన్ని ఆదుకుంటామని టాస్క్‌ఫోర్స్ డిఐజి శ్రీనివాస్ తెలిపారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను తమ శాఖ కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని సహాయ, సహకారాలు త్వరగా అందేలా చూస్తామని తెలిపారు. మృతుడి భార్యకు ఉద్యోగం ఇచ్చేందుకు ప్రతిపాదిస్తామని పేర్కొన్నారు. మృతుడి భార్యను పరామర్శించి, మానసిక స్థైర్యాన్ని అందించారు.

మృతుడి భార్యకు ధైర్యం చెబుతున్న టాస్క్‌ఫోర్స్ డిఐజి శ్రీనివాసులు

మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా ఎస్‌పి కృష్ణారావు

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - కడప : ఏమైనా విద్యుత్ సమస్యలుంటే వినియోగదారులు ఈ నెల 8న విద్యుత్ భవన్ కాన్ఫరెన్సు హాల్‌లో నిర్వహించే విద్యుత్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని కడప విద్యుత్ డిఇఇ ఎల్.నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. కడప డివిజన్ పరిధిలోని కడప, చెన్నూరు, చింతకొమ్మదిన్నె, నందిమండలం, పెండ్లిమర్రి, వల్లూరు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై రాతపూర్వక ఫిర్యాదు ద్వారా విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'అత్యధిక రాబడి కోసం ఎల్ఐసి ఇండెక్స్ పాలసీ'

ప్రజాశక్తి - కడప అర్బన్ : రిస్క్ కవర్‌తో పాటు, మంచి రాబడి లక్ష్యంగా 'ఎల్ఐసి ఇండెక్స్ ప్లస్' పేరుతో, తన 67 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా మారుతున్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎల్ఐసి ఒక నూతన పాలసీ ప్రారంభించిందని సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. ఇన్వెస్టర్లు నేరుగా స్టాక్ మార్కెట్లో పెట్టు బడులు పెట్టాలంటే చాలా సాంకేతిక పరిజ్ఞానం, నిత్య జాగరూకత అవసరమని, ఎల్ఐసి ఇండెక్స్ పాలసీ ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని అన్నారు. ఈ పాలసీ ద్వారా నెలకు కేవలం రెండున్నర వేల రూపాయలు కూడా పాలసీదారు ప్రీమియం రూపంలో చెల్లించవచ్చని, అందువల్ల ఇది సాధారణ ప్రజలకు కూడా అనువైనదన్నారు. 90 రోజుల వయసున్న పసిపాప నుండి 60 ఏళ్ల వయసున్న వారు ఈ పాలసీ తీసుకోవచ్చని అన్నారు. పాలసీదారు 10 నుంచి 20 సంవత్సరాల ప్రీమియం చెల్లింపు కాలాన్ని ఎంచుకోవచ్చని, అతని వార్షిక ఆదాయానికి ఏడు నుంచి పదిరెట్ల మొత్తం వరకు బీమా పాలసీ తీసుకోవచ్చని అన్నారు. పాలసీ మెచ్యూరిటీ అనంతరం ఫండ్ వాల్యూ చెల్లిస్తారని, దురదృష్టవశాత్తు మరణం సంభవిస్తే ఫండ్ వ్యాల్యూ లేదా బీమా మొత్తం లేదా చెల్లించిన ప్రీమియం మొత్తానికి 105 శాతం ఎల్ఐసి చెల్లిస్తుందని అన్నారు. పాలసీ అమల్లో ఉన్న కాలంలో 6, 10, 15, 20, 25 సంవత్సరాల అనంతరం గ్యారంటీడ్ ఆడిషన్స్ పాలసీకి జమ అవుతాయని అన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, మేనేజర్ సేల్స్ శ్రీనివాస్, ప్రోడక్ట్ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రయివేట్ రుణయాప్ ఉచ్చులో పడొద్దు

- నాబార్డు డిడిఎం బి.విజయవిహారి

ప్రజాశక్తి- కడప అర్బన్ : దైనందిన, వ్యాపార అవసరాల నిమిత్తం ప్రజలు ప్రయివేట్ రుణ యాప్‌లను ఆశ్రయించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని, రుణ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని నాబార్డ్ జిల్లా డిడిఎం బి.విజయ విహారి పేర్కొన్నారు. రాయలసీమ హరిజన, గిరిజన, వెనుకబడిన, మైనార్టీ సేవా సమాజం ఆధ్వర్యంలో మంగళవారం హోటల్ మయూర గార్డేనియాలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీఫండ్స్ సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు 'పొదుపు ఖాతాదారుల ఆర్థిక విద్య' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిడిఎం మాట్లాడుతూ ప్రయివేట్ రుణ యాపుల ఉచ్చులో పడవద్దని సూచించారు. రుణాలు తీసుకున్న తర్వాత అధిక వడ్డీలు చెల్లించలేక, వారి వేధింపులు భరించలేక ఎంతో మంది ప్రాణాలు తీసుకుంటున్నారని తెలిపారు. తక్కువ వడ్డీకే అనేక ప్రభుత్వ బ్యాంకులు వివిధ రుణాలను మంజూరు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో పెరిగిపోయిన సైబర్ నేరాల పట్ల ప్రజలు, రైతులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకింగ్ కార్యకలాపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్‌హెచ్‌జిబిఎం ఎస్ ఎస్ డైరెక్టర్ బి.వి.రత్నం మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ప్రజలకు, రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిండికేట్ బ్యాంక్ రిటైర్డ్ ఆర్‌ఎం రఘునాథరెడ్డి, ఎస్‌బిఐ లైఫ్ రిటైర్డ్ ఏరియా మేనేజర్ కె.నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిడిఎం విజయ విహారి

విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - రాయచోటి

శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కంటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ధరణిధర ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్, సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి పౌష్టికాహారంతో 50 శాతం వరకు దృష్టిలోపాలను నివారించవచ్చని తెలియజేశారు. విద్యార్థులు దృష్టిలోపాలను మొదటి దశలోని గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచించారు. సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జీవన యానంలో ఇంద్రియాలన్నింటిలో కళ్లు ప్రధానమైనవని, కంటికి ఎటువంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు వహించాలని ప్రయాణ సమయంలో హెల్మెట్, కళ్ళజోడు ధరించాలని చెప్పారు. తీసుకునే ఆహారంలో ఆకుకూరలు వాడకం వల్ల కంటికి కావలసిన పోషక పదార్థాలు సమృద్ధిగా అందుతాయని వివరించారు. నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించి అంధుల జీవితంలో వెలుగులు నింపాలని తెలియజేశారు. అగర్వాల్ క్లినిక్ సాంకేతిక సిబ్బంది సుమారు 340 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

9న వాల్మీకిపురం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి : టెక్నికల్ డైరెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నాణ్యమైన విద్యుత్ సేవలను అందించాలని విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ ఎన్.వి.సుబ్బరాజు పేర్కొన్నారు.మంగళవారం ఆయన పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంత వినియోగదారులకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలని సూచించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడంతో పాటు 11 కె.వి లైన్లు ఓవర్ లోడ్ లేకుండా చూసుకోవాలన్నారు. 33 కెవి లైన్లు మెయిన్టెనెన్స్ చేసుకుంటూ విద్యుత్ సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడూ చూసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లుల బకాయిలను నిర్లక్ష్యం చేయకుండా వసూలు చేయాలని, రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే సకాలంలో స్పందించి పునరుద్ధరించాలని ఆయన సూచించారు. అనంతరం రాయచోటి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని సంబేపల్లి మండలం దేవపట్ల 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి, మండలంలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును ఇవ్వాలని రైతులకు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చాంద్‌బాషా, విజయకుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అకౌంట్ ఆఫీసర్ పాపయ్య, కమర్షియల్ ఎఇ నరేంద్రనాథ్ రెడ్డి, అన్ని మండలాల ఎఇలు, జెఇలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సుబ్బరాజు

మహిళలను కించపరిచేవారిపై చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీలోకి మహిళలను ఆహ్వానిస్తున్న రెడ్డి సాహెబ్

ప్రజాశక్తి -మదనపల్లి

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మదనపల్లి నియోజకవర్గం నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ ఆధ్వర్యంలో నీరుగట్టివారిపల్లినకు చెందిన మహిళలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజల జీవితాలను నడ్డి విరిచే విధంగా ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వాలను విసిగి వేశారేసిన ప్రజలు అందరూ ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. తల్లి, చెల్లి అనే సంబంధాలను కూడా విస్మరించి మహిళా లోకానికి అవమాన పరిచేలా ట్రోలింగ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ట్రోలింగ్ చేస్తున్న వారిపై జగన్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతమని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళా లోకానికి గౌరవించేలా వ్యవహరించాలని హితవు పలికారు. తల్లిని, చెల్లిని గౌరవించలేని నాయకులు రాష్ట్రంలోని మహిళలకు ఎలా భద్రత కల్పిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండలం అధ్యక్షులు సురేంద్రరెడ్డి, మహిళా అధ్యక్షులు వై.ఈశ్వరమ్మ, మహమ్మద్ రఫీ, మహమ్మద్ అలీ, అమిర్ జాన్, ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఇ.రవీంద్ర లు పాల్గొన్నారు.

ఆశాడే కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

నులిపురుగులను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి- కలకడ

జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించి పిల్లల్లో నులిపురుగుల నివారణకు కృషి చేద్దామని వైద్యాధికారులు ఎంవి.కిషోర్ కుమార్‌రెడ్డి, జవహర్‌బాబులు పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0 నుంచి 18 ఏళ్లలోపు వారికి అల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజ నాంతరం మింగించాలని సూచించారు. మార్చి 3,4,5 తేదీలలో పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందని తెలి పారు. ప్రతి బూత్ పరిధిలో జరిగే పల్స్ పోలియోకు సర్పంచ్‌లు, గ్రామ పెద్దల సహకారం తీసుకోవాలని అన్నారు. మండలంలో 0 నుంచి 5 సంవత్స రాలలోపు ఉన్న1698 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపరు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య. పిహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, హెల్త్ సూపర్వైజర్స్ వెంకటేశ్వరరావు, బి.రెడ్డమ్మ, స్టాటికల్ ఆఫీసర్ షేక్ ఇస్మాయిల్, ఫార్మసిస్ట్ షరీఫ్‌బాషా, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని నడించెర్ల ఎస్‌సిహాస్టల్‌ను సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు డి.జాకీర్ హుస్సేన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హాస్టల్‌లో పరిసరాలు, వంటగదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలన్నారు. పరిశుభ్రతను పాటించి ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు.దోమల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. హాస్టల్‌లో వంటకాలలో తాజా కూరగాయలను మాత్రమే వాడాలని, జనరిక్ మందులను అందుబాటులో ఉంచాలని, జెవిజె, వసతి దీవెన సత్వరం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల అధికారిగా లీలారాణి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గం ఎన్నికల అధికారిగా బి.లీలారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాజంపేట ఎస్ఎస్‌పి యూనిట్ విభాగం-4లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడి వచ్చారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-నందలూరు

ఆడపూరు వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ (ఇంగ్లీష్) ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉంటుందన్నారు. ఐదో తరగతి ప్రవేశానికి 4వ తరగతి చదువుతున్నవారు అర్హులని, అలాగే ఇంటర్మీడియట్ ప్రవేశానికి పదవ తరగతి చదువుతున్న వారు అర్హులని అన్నారు. ఉమ్మడి కడపజిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు 9704550128 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మాట్లాడుతున్న వి.శ్రీనివాసులు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రలోభాలు, ఒత్తిళ్లకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సెక్టోరియల్ అధికారి వల్లెపు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పోలింగ్ స్టేషన్ 216, 217 నూలివీడు కస్పా, నాగూరువారిపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల వద్దకు ఓటు వేయడానికి కూడా రానివ్వకుండా ఎవరైన అడ్డుకుంటే తమ దృష్టికి తీసుక రావాలని సూచించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బిఎల్ఒలు, ఓటర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు మండలం ఓబనపల్లి దళితవాడలో వైసిపి నాయకులు నగిరిపాటి కృష్ణయ్య అకస్మాత్తుగా మృతి చెందడంతో వైస్ ఎంపిపి రామిరెడ్డి ద్వజారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి దహన ఖర్చులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో రమణ రెడ్డి,కృష్ణారెడ్డి, డివి.రమణ, శివాజీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కొండా నరేంద్ర

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుని పారిశ్రామిక వేత్త, టిడిపి నాయకులు కొండా నరేంద్ర కలిశారు. మంగళవారం జిడినెల్లూరులో జరిగిన రా...కదలిరా సదస్సుకు చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ నేపథ్యంలో హెలిప్యాడ్ వద్దకు చేరుకొని అధినేతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి,శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కొండా నరేంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని, పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. చంద్రబాబు మంచి విజనరీ కలిగిన నాయకుడని, ఆయన ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ప్రజలంతా అండగా నిలిచి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. త్వరలో జరుగబోవు ఎన్నికల్లో అటు తంబళ్ల పల్లితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇటు టిడిపి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

H.M.O.P.No. 81/2023

ఆమూరి గంగాధర్, S/o రెడ్డిరామయ్య సాకీన్, రెడ్డిస్ కాలని, నియల్ రవిహాల్, రాయచోటి.

...పిటిషనర్

Vs

ఆమూరి అమరావతి,W/o గంగాధర్,D/o ఆసాది గంగయ్య, సాకిన్ కొత్తపేట, వీరబల్లి టౌన్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంటు

ప్రకటన

పై దావాలోని పిటిషనర్ రెస్పాండెంటు అయిన నీ పైన విడాకులు తీసుకొనుటకు గాను దావా దాఖలు చేసియున్నాడు. నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 22.2.2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు సదరు కోర్టులో హాజరు అయి నీ యొక్క ఆక్షేపణ తెలుపుకొనవలెను. లేనంతట నీ పరోక్షమున తీర్మాణించబడును అని ఇందుమూలమున ఖండితముగా తెలియజేయడమైనది.

//By Order of the Court//

యు.రామాంజనేయులు

జి.సి.ఎస్.రాయుడు

పిటిషనరు తరపు వకీలు,

రాయచోటి, అన్నమయ్య జిల్లా.

NAME OF CHANGE

I Anugula Seshaiah s/o Anugula pedda venkata subbaiah, D.No.7/4 Lingireddy palli (V),Chinnampalli (p) Obulavaripalli (M), 516108 Annamaiah (Dt). I have been changed my name as **YENUGULA SESHAIAH** s/o **YENUGULA PEDDA VENKATA SUBBAIAH.**

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష' : ఎంపిడిఒ

వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ,డిప్యూటీ డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-వీరబల్లి

జగనన్న ఆరోగ్యసురక్ష పేదలకు వరంలాంటిదని, పేద ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులుపడకుండా, ఇంటి వద్దకే వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దవీడు పంచాయతీలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఒతో పాటు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులతో ఎంపిడిఒ మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులు అందించాలని సూచించారు. కార్పొరేటు వైద్యానికి ధీటుగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్పొరేట్ వైద్యానికి దీటుగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులందరికీ వివిధ ఆరోగ్య పరీక్షలు చేయించి బిపి, షుగర్, రక్తపరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు డాక్టర్ జియ ఉల్లా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, స్పెషలిస్ట్ డాక్టర్లు, పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.**పుల్లంపేట :** మండల పరిధిలోని పెద్ద ఓరంపాడు గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఎల్లాయపల్లి సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆనాడు వైఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టి పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించారన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు అంతకు మించి వైద్యసేవలను మూరు గ్రామాలలోని ఇళ్లవద్దకే తీసుకవచ్చారని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిని జల్లె డపట్టి అనారోగ్యంతోఉన్నవారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించే కార్యక్రమాన్ని చేపట్టడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గురుమహేష్, ఎంపిడిఒ కులాయప్ప, సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.**వీలేరు:** వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయడానికి మేలైన ఆరోగ్య సేవ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని జిల్లా జగనన్న ఆరోగ్య సేవలు, జిల్లా టీకాల నిర్వహణ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి ఆధ్వర్యములో మంగళవారం బొడుమల్లువరిపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డాక్టర్ ఉషశ్రీ పర్యవేక్షించి, ఆన్‌లైన్‌లో సిబ్బంది నమోదు చేస్తున్న ఆరోగ్య సేవల్ని తనిఖీ చేసి, సూచనలిచ్చారు. వైద్యశిబిరంలో చిన్నపాటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 405 మందికి చికిత్సలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మరో ముగ్గురిని వివిధ ఆసుపత్రులకు మేలైన చికిత్స కోసం పంపారు. కార్యక్రమంలో సాధారణ వైద్యులు డాక్టర్ రమేష్ రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపనులు డాక్టర్ శివయ్య, చెవి, ముక్కు, గొంతు వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీదివ్య, కంటి వైద్య నిపుణులచే ఆరోగ్య సేవలు నిర్వహించారు. సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మాట్లాడుతున్న సర్పంచ్ నారాయణరెడ్డి

వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలి : ఎంపిపి

ప్రజాశక్తి-నందలూరు

మండల ప్రభుత్వ వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలని హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైద్యులు ఫ్యామిలీ ఫిషియన్ కాన్సెప్ట్ (104)కు తప్పనిసరిగా హాజరు కావాలని, గర్భిణులను పరీక్షించి కాన్పులను నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో వార్డు, ఫార్మసీ, కాన్పులగది సందర్శించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్, మండల అభివృద్ధి అధికారి బుక్కే శేఖర్‌నాయక్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, స్థానిక నాయకులు ఆరుముగం విశ్వనాథ్ , సిహెచ్ఒ వెంకటనారాయణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

మంగంపేట సమస్యలు పరిష్కరించాలి

-కలెక్టర్‌ను కలిసిన తల్లెం భరత్ కుమార్‌రెడ్డి

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మంగంపేట, కాపుపల్లి, అరుంధతివాడ, దళితవాడ, అగ్రహారం, ఆర్ఆర్ సెంటర్ గ్రామాల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలకు సంబంధించి సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీలు, పరిహారం గురించి కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు.గత యేడాది డిసెంబర్ 21న మైన్స్ ఎండి వెంకట్‌రెడ్డి అగ్రహారం తరలించేందుకు బోర్డు మినిట్స్‌లో పరిహారం ఇచ్చేందుకు రాతపూర్వకంగా లేఖను ఇచ్చినట్లు తెలిపారు. మంగంపేట గ్రామాల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారని తెలిపారు. ఆర్ఆర్ సెంటర్-1 లో గత ఇరవై ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పొజిషన్ సర్టిఫికేట్ పట్టాలు త్వరగా పంపిణీ చేయాలని కోరినట్లు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే వీటిపై సమావేశం నిర్వహించి పరిష్కరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పసుపులేటి సురేష్‌బాబు, నరసింహచారి, గురజాల దినేష్, పుల్లగంటి బాలసుబ్రమణ్యం, ఎం.వి నరసింహులు, జంపయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

జనసేన సిద్ధాంతాలను ప్రతి గడపకూ తెలియజేయాలి

ప్రజాశక్తి-ములకలచెరువు

జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తెలియజేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని కదిరినాథునికోట పంచాయతీ, మల్లెం ఫాంహౌస్లో నియోజవకర్గ స్థాయి జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఎన్నికల గుర్తు గాజుగ్లాసు అని, అదే విధంగా పవన్ కల్యాణ్ నాయకత్వం, ఆయన ఆశయ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకువెళ్లాని తెలియజేశారు. రాష్ట్రంలో ప్రజాపరిపాలన సంక్షేమ అభివృద్ధి పనులు, భావితరాల భవిష్యత్తు కోసం త్వరలో జరిగే ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమి అభ్యర్థికి తమవంతు మద్దతు తెలిపాలని కోరారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా లీగల్సెల్ అమర్నారాయణ, జాయింట్ సెక్రటరి షాకీర్, మండల అధ్యక్షుడు శంకర, దామోదర్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సాయినాథ్

ఉపాధి పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - పెద్దమండ్యం

ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది, జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలని జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మహేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ భవనంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరుకు వంద రోజుల పని కల్పించాలని, ముఖ్యంగా చెరువుల్లో పూడికతీత, పండ్ల తోటలు పెంపకం చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎపిడి మధుబాబు, పి ఒ మురళి, టెక్నికల్ అసిస్టెంట్‌లు కుమార్, శంకర, సోమశేఖర్, భూదేవి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

పెద్దమండ్యం ఎంపిడిఒగా వెంకటరమణయ్య

ప్రజాశక్తి-పెద్దమండ్యం

పెద్దమండ్యం మండల అభివృద్ధి అధికారిగా చావడి వెంకట రమణయ్య మంగళవారం భాద్యతలు చేపట్టారు. గతంలో కడప జిల్లా పెద్దముడియం మండలంలో ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు.

తంబళ్లపల్లి ఎంపిడిఒగా కృష్ణమూర్తి

తంబళ్లపల్లి : తంబళ్లపల్లె ఎంపిడిఒగా కృష్ణమూర్తి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రి పురం మండలం ఎంపిడిఒగా విధులు నిర్వ హిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమ స్యలను పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామ సచివాలయాల ద్వారా గ్రామీణ ప్రజలకు అన్ని రకాల సేవలు సకాలంలో అందిస్తామని తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-రామాపురం

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ బిఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కల్పనా చెరువు పంచాయతీ ముగిరెడ్డిగారిపల్లెలో మంగళవారం బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే బాలికలకువివాహాలు చేస్తే అటువంటి వారిపై చట్టరీత్యా చర్య తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహాలు చేస్తే వారికి కుటుంబం పైన అవగాహన కలిగి ఉంటుందన్నారు. చిన్న వయసులో వివాహాలు చేస్తే వారి జీవితం చిన్నాభిన్నం అవుతుందని అన్నారు. అమ్మాయిలకు చక్కడా ఉన్నత చదువులు చదివించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై యువకులు బలి అవుతున్నారని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడప కూడదని సూచించారు. వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు వాహ నానికి సంబంధించిన పర్మిట్లు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. లేనిచో వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. లాటరీల భ్రమలో ప్రజలను కొంతమంది మోసం చేస్తున్నారని అటువంటి మోసగాళ్లను నమ్మొ వద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు పెరిగి పోయాయని వాటిపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వైష్ణవి, వెంకట్రామిరెడ్డి, చెన్నారెడ్డి, జనార్దన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, డ్వాక్రా మహిళ సంఘాలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నర్సరీ నిర్వాహకులకు నోటీసు అందిస్తున్న సురేష్

అనుమతుల్లేని నర్సరీలపై చర్యలు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలో కూరగాయలు, పూలు, పండ్ల నర్సరీలు నిర్వహించే యజమానులు తప్పనిసరిగా ఉద్యాన శాఖ ద్వారా అనుమతి పొందాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని మండల ఉద్యానశాఖ అధికారి జి. సురేష్ తెలిపారు. మంగళవారందేవగుడిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీ యాక్ట్ ప్రకారం లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న నర్సరీ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నర్సరీ యజమానులు ఫారం'ఎ' తోపాటు వెయ్యి రూపాయలు చలానా చెల్లించి భూమి పాసుపుస్తకం,నర్సరీ లేఅవుట్, భూమి లీజు తీసుకున్నట్లయితే లీజునకలు మట్టి నీటి నమూనా రిపోర్టులతో ఉద్యాన అధికారికి దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని సూచించారు. ఇకపై లైసెన్స్ లేకుండా నర్సరీ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎంపిఇఒ కుమారి పాల్గొన్నారు.

విద్యా ప్రగతి వర్క్ బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒ

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యంశాలు అర్థమయ్యేలా బోధించాలని ఎంఇఒ వెంకటరమణ సూచించారు. మంగళవారం మండలంలోని బలకవారిపల్లి పాఠశాలను ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల విద్యాప్రగతి వర్క్ బుక్స్ కరెక్షన్, ఉపాధ్యాయుల తరగతి బోధన, మధ్యాహ్న భోజనం మొను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు గోబ్రేనాయక్, ప్యానెల్ టీచర్ జయరాం, సిఆర్‌పి లక్ష్మీపతి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వైసిపి నాయకుడు మద్రిమాకులపల్లి మాజీ సర్పంచ్ వెంకట్ రవణారెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, సర్పంచులు ,మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, టీచర్లు, మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. గతంలో వరుసగా మూడుసార్లు గ్రామ సర్పంచిగా ఎన్నికై పంచాయతీ అభివృద్ధికి నిస్వార్థంతో ప్రజలకు సేవలు అందించి గ్రామ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర కొనియాడారు.

క్రైం కార్నర్

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లి

నాటుసారా నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

నాటుసారా విక్రయిస్తున్న నిందితుడిని ఎస్ఇబి పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లి సెబ్ సిఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలం లోని మొలకలదిన్నెకు చెందిన రెడ్డప్ప మంగళవారం అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని అన్నారు. తమ సిబ్బందితో రెడ్డప్ప ఇంట్లో సోదాలు నిర్వహించి, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 45లీటర్ల నాటుసారాను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని విక్రయించారు.

నిమ్మనపల్లిలో పది లీటర్లు..

నిమ్మనపల్లి: నాటుసారా విక్రయస్థావరం పై నిమ్మనపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ సి.లోకేష్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. అగ్రహారం పంచాయతీ చింతపర్తివారిపల్లెకు చెందిన రాయచోటి వెంకటరమణ గ్రామ సమీపంలో నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులకు రాబడిన సమాచారం మేరకు దాడులు చేసి అతని వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నాటుసారా విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితుడిపై ఎస్ఐ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో 12 లీటర్లు..

కలకడ: నాటు సారా స్వాధీనం చేసుకుని మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సమీపంలో ఉన్న ఎస్‌సి కాలనీకి దక్షిణం వైపున నాటుసారా విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్‌టి కాలనీకి చెందిన బుక్కే రాజానాయక్ భార్య బుక్కే రాణి నుంచి 12 లీటర్ల నాటుసారాను గుర్తించి స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు అరిచినట్లు తెలిపారు.

కంటైనర్ స్వాధీనం

ప్రజాశక్తి-రామసముద్రం

మండల పరిధిలోని ఎలవానెల్లూరు పంచాయతి ఎ.కొత్తూరు సమీపంలో ఎస్పి, మదనపల్లె డిఎస్‌పి ఆదేశాలు మేరకు మదనపల్లె రూరల్ సిఐ సూచనల మేరకు వాహనాల తనిఖీ చేపట్టామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ తనిఖీలో కర్ణాటక వైపు నుంచి వస్తున్న కంటైనర్ ఆపి తనిఖీ చేయగా అందులో పార్సిల్ బాక్సులు ఉండటంతో పరిశీలించగా 6864 గోడ గడియారాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వాటి పై పుంగనూరుకి చెందిన భారత చైతన్య యువ జనపార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ఫోటో ఉండి, ఆయన పార్టీ గుర్తుకు ఓటు వేయమని ప్రింట్ చేసి ఉండగా అది రాబోవు ఎన్నికలలో ఓటర్లు ప్రలోభ పెట్టె విధంగా ఉన్నందున, తదుపరి చర్యకై స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కారు, బైక్ ఢీ : విద్యార్థికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గంగనేర్ క్రాస్ రోడ్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌ను కారు ఢీనడంతో హెచ్.వెంకటాద్రి అనే విద్యార్థికి తీవ్ర గాయాలైనట్లు రామాపురం ఎస్ఐ బిఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలమేరకు..మండలంలోని రాచపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి చెందిన హెచ్.వెంకటాద్రి రాయచోటి కళాశాలలో ఎమ్ఎల్‌టి చదువుతున్నాడని తెలిపారు. విద్యార్థి సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంలో వస్తూ ఉండగా గంగనేర్ క్రాస్ వద్దకు రాగానే రోడ్డు దాటుతుండగా కడప వైపు నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు బైక్ డీకొనడంతో విద్యార్థికి తలకు, కంటికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన విద్యార్థిని చికిత్స నిమిత్తమై 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.